క్లుప్తంగా

తొలిరోజే 96 శాతం పింఛన్ల పంపిణీ


పింఛన్ నగదు అందజేస్తున్న వల్లంటీర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో బుధవారం తెల్లవారు జాము నుంచే వలంటీర్లు సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ల నగదు అందజేశారు. ఆలత్తూరు, కంచనపుత్తూరు, కల్లివెట్టు, కుక్కంబాకం, పల్లమాల, జీఎస్‌కండ్రిగ గ్రామాల కార్యదర్శులు ఇందిరమ్మ, మునికృష్ణ, శివకుమార్ ఆధ్వర్యంలో సాయంత్రంలోపు 96 శాతం పింఛన్లను పంపిణీ చేశారు.

నేడు పిచ్చాటూరులో ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు: పిచ్చాటూరులో గురువారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.వెంకటచలపతి రాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు నీటిపారుదలశాఖ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుంటారన్నారు. అరణియార్ పర్యాటక అభివృద్ధి పనులు, జైకా నిధులతో జరుగుతున్న ప్రాజెక్టు ఆధునికీకరణ పనులను పరిశీలిస్తారని పేర్కొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : తొట్టంబేడు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద విరివిగా పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈమేరకు ఏపీవో సుజాతకు వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తులసీరాజన్, జిల్లా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ మాట్లాడుతూ రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని, రోజు కూలీ రూ.600 ఇవ్వాలని కోరారు. పనులు జరిగే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జాబ్ కార్డులు లేకపోయినా పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 11.381 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 11.381 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5 , మొదటి బ్రాంచ్ కెనాల్ కు 5, లోలెవల్ స్లూయీస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ శారద జయలక్ష్మీదేవి

తిరుపతి సిటీ : సేంద్రియ సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి తెలిపారు. బుధవారం తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయంపై జాతీయ స్థాయి శిక్షణను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అవసరాల మేరకు సమీకృత వ్యవసాయం, సేంద్రియ పద్ధతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రసాయనాలను విచక్షణ రహితంగా వాడడం వల్ల భూమిలో కర్బన శాతం తగ్గి జీవ వైవిధ్యంపై ప్రభావం చూపుతుందని చెప్పారు. ఆహార భద్రత సమస్య ఉత్పన్నం కాకుండా శాస్త్రవేత్తలు అంకుర సంస్థలు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఏడీఆర్ డాక్టర్ సి.రమణ మాట్లాడుతూ తమిళనాడు, ఏపీ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, కేరళ, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 37 మంది శాస్త్రవేత్తలు ఈ సదస్సులో పాల్గొనడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో ఐసర్ డైరెక్టర్ శాంతనుభట్టాచార్య, ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రభాకర్‌రెడ్డి, పీవీ సత్యగోపాల్, కృష్ణారెడ్డి, శాస్త్రవేత్త బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ నాగమాధురి పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మపై అవగాహన

పెళ్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 18 ఏళ్లకు పైగా పూర్వీకుల నుంచి వచ్చిన వృత్తిని చేస్తున్న హస్త కళాకారులు పీఎం విశ్వకర్మకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి గుర్తింపు కార్డు అందించనున్నట్లు వెల్లడించారు.

ఓజిలి: పీఎం విశ్వకర్మ పథకాన్ని చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సాంప్రదాయ నైపుణ్యాలు, హస్తకళలను ప్రోత్సహించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని వెల్లడించారు. మండలంలో ప్రతి పంచాయతీ నుంచి 20 మందిని ఎంపిక చేసి రూ.3లక్షల చొప్పున రుణాలు మంజూరు చేస్తున్నారని వివరించారు.

పల్లె చెంతకే వైద్యం

వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా వైద్యాన్ని ప్రభుత్వం రోగుల చెంతకే చేర్చింది. పల్లెవాసులకు ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. చాపకింద నీరులా గ్రామాల్లోనూ విస్తరిస్తున్న జీవనశైలి జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించి అరికట్టే లక్ష్యంతో విలేజీ క్లినిక్‌ను తీసుకొచ్చింది. ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరేసి డాక్టర్ల చొప్పున మండలానికి నలుగురిని నియమించి గ్రామీణ వైద్య వ్యవస్థను బలోపేతం చేసింది. సత్యవేడు నియోజకవర్గానికి 71 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా, ఇవన్నీ పూర్తి స్థాయిలో వైద్యసేవలను ప్రారంభించాయి. వీటి పక్కా భవనాల నిర్మాణాలకు సంబంధించి రూ. 12.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

- వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లతో ప్రజలకు ఆరోగ్య భరోసా
- 12 రకాల సేవలు.. 14 పరీక్షలు
- గ్రామీణుల్లో జీవన శైలి జబ్బులు ఆదిలోనే కట్టడి
- ప్రతి 2500 మంది జనాభాకు ఒక వీహెచ్‌సీ
- సత్యవేడు నియోజకవర్గంలో 71 వీహెచ్‌సీలు

వరదయ్యపాళెం : దగ్గు, జలుబు, జ్వరం, బీపీ, షుగర్ లాంటి జీవన శైలి వ్యాధులను ఆదిలోనే గుర్తించడం ద్వారా ప్రాణాంతకం కాకుండా నివారించవచ్చు. బీపీ లాంటి వాటికి సకాలంలో చికిత్స చేయకుంటే నరాల జబ్బులు, కార్డియాక్ అరెస్టు, పక్షపాతం బారినపడే ప్రమాదం ఉంది. షుగర్ వ్యాధికి సరైన సమయంలో చికిత్స చేయకుంటే కిడ్నీ సమస్యలకు దారి తీస్తుంది. గ్రామీణులకు సొంతూరిలోనే మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంటే ఇలాంటి వాటిని నియంత్రించడం సులభతరం అవుతుంది. ఇప్పుడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థలు అదే పనిచేస్తున్నాయి. గతంలో ఇలాంటి వ్యాధుల నివారణకు ప్రవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఈ కష్టాలకు విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుతో ప్రభుత్వం చెక్ పెట్టింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు సత్వర వైద్యం అందుబాటులోకి తేవడం కోసం వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రాలు (వీహెచ్‌సీ)లు నిర్మాణం చేపట్టింది. ప్రతి 2వేల నుంచి 2500 జనాభా వరకు ఒక వీహెచ్‌సీను ఏర్పాటు చేసి వైద్యసేవలను ప్రారంభించింది. ఈ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లో ఇద్దరు ఆశావర్కర్లు, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్‌లు సేవలు అందిస్తున్నారు. వీరి ద్వారా 12 రకాల వైద్యసేవలు అందనున్నాయి. సత్యవేడు నియోజకవర్గంకు 71 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా ఇవన్నీ పూర్తిస్థాయిలో వైద్యసేవలను ప్రారంభించాయి. వీటికి పక్కా భవనాల నిర్మాణాలకు సంబంధించి రూ. 12.60 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే 50శాతంకు పైగా పక్కా భవనాలు పూర్తి స్థాయిలో నిర్మాణం జరిగి, వాటిలో వైద్యసేవలు ప్రారంభమయ్యాయి. మిగిలిన 50శాతం భవనాలు వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి.


బీఎన్‌కండ్రిగ మండలం నీర్పాకోటలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్


బత్తలవల్లం విలేజ్ క్లినిక్‌లో వైద్యసేవలు పొందుతున్న గ్రామీణులు

పక్కాగా కుటుంబ ఆరోగ్య సమాచారం

కరోనా వైరస్ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబ ఆరోగ్య సమాచారాన్ని ఆరోగ్య సిబ్బంది ద్వారా సేకరించింది. దీర్ఘకాలిక, ఇతర వ్యాధులకు సంబంధించిన వివరాలను నమోదు చేసింది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వీహెచ్‌సీల ద్వారా కుటుంబ ఆరోగ్య సమాచారం ఆధారంగా వైద్యం అందించనున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని 7 మండలాల్లో ఏర్పాటు చేసిన వీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నారు. వీహెచ్‌సీలో అందించే 12 రకాల సేవలకు పైబడిన సేవలను ఆన్‌లైన్ టెలి మెడిసిన్ మాదిరిగా రోగులకు సిబ్బంది సేవలు అందిస్తున్నారు.



ఇంటి వద్దనే తల్లీబిడ్డ యోగక్షేమాలు, గ్రామస్థాయిలో విద్యార్థులకు వైద్యం

వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ సేవలు ఇలా ..


- గర్భిణులు, చిన్నారుల సంరక్షణ
- నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణ
- బాల్యం, కౌమార దశ ఆరోగ్య సేవలు
- జీవనశైలి జబ్బుల స్క్రీనింగ్, నివారణ
- వైఎస్సా ర్ విలేజ్ క్లినిక్స్ సేవలు ఇలా
- గర్భిణులు, చిన్నా రుల సం రక్షణ
- నవజాత శిశువుల ఆరోగ్య సం రక్షణ
- బాల్యం , కౌమార దశ ఆరోగ్య సేవలు
- అంటు వ్యాధుల నివారణ
- సాధారణ అనారోగ్యాలు,చిన్న చిన్న జబ్బులకు జనరల్ అవుట్ పేషంట్ కేర్
- కంటి, చెవి సమస్యలపై జాగ్రత్తలు
- దంత ఆరోగ్య సంరక్షణ
- వృద్ధాప్య వ్యాధులకు చికిత్స
- కాలిన గాయాలు, ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర సేవలు

స్థానికంగా వైద్య సేవలు



ఎన్నడూ లేని విధంగా గ్రామంలోనే వైద్యసేవలు అందుతున్నాయి. స్థానికంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు రోజూ వైద్య సిబ్బంది హాజరవుతున్నారు. జ్వరం, జలుబు, ఇతరత్రా సాధారణ వ్యాధులకు సంబంధించి స్థానికంగానే వైద్యం చేస్తున్నారు. **–మంగమ్మ, సంతవేలూరు**

ఎంతో ఉపయోగకరం



గతంలో జ్వరం వస్తే వరదయ్యపాళెం, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటకు వెళ్లాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం మా గ్రామంలో జగనయ్య ఏర్పాటు చేసిన ఆస్పత్రిలోనే వైద్యం చేస్తున్నారు. ఈ ఆస్పత్రి మాలాంటి వృద్ధులకు ఎంతో ఉపయోగకరం. నెలకు సరిపోయే షుగరు, బీపీ మందులు కూడా ఇక్కడే ఇస్తున్నారు. **–బుజ్జమ్మ, సంతవేలూరు**

12 రకాల సేవలు అందిస్తున్నాం



గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామ ఆరోగ్య కేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. 12 రకాల వైద్యసేవలు వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్‌లలో అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే ఆరోగ్య సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ వైద్యసేవలు అందజేస్తున్నాం. భవిష్యత్‌లో మరిన్ని సేవలు వీహెచ్‌సీల పరిధిలోకి రానున్నాయి. **–లావణ్య, ప్రధాన వైద్యాధికారిణి, చిన్న పాండూరు పీహెచ్‌సీ**

ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా మండపం పనులు


పనులను పరిశీలిస్తున్న దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: కైలాస గిరిప్రదక్షిణ మార్గంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా 8 విడిది మండపాలను నిర్మిస్తున్నట్లు శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విడిది మండపాల నిర్మాణ పనులను పరిశీలించారు. అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాల్లో ఒకసారి, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మరోసారి శ్రీస్వామి,అమ్మవార్లు గిరి ప్రదక్షిణ చేస్తారన్నారు. అశేష భక్తులు కూడా వెంట గిరిప్రదక్షిణ చేస్తారని తెలిపారు. గిరిప్రదక్షిణ మార్గాల్లో ఉన్న గ్రామాల ప్రజల వినతి మేరకు 8 విడిది మండపాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పూజలు చేసే విధంగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనే విధంగా నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. సంక్రాంతి లోపు పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు వేణుగోపాల్‌రెడ్డి, బాలాజీ, కుమార్, సుదర్శన్‌రెడ్డి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణలు చేయాలి


మాట్లాడుతున్న ఆర్‌డీఓ రవిశంకర్‌రెడ్డి

ఏర్పేడు: ఓటరు జాబితాలో సవరణలు చేపట్టాలని శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్‌ఓలతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా, వయస్సు తదితరాల పొరబాట్లను సరి చేయాలని తెలిపారు. తహసీల్దార్ శివప్రసాద్, ఆర్ఐ సంతోష్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు దుస్తుల వితరణ


క్రీడా దుస్తులతో విద్యార్థులు తదితరులు

నారాయణవనం: అండర్–17 సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శరవణరెడ్డి బుధవారం క్రీడా దుస్తులను అందజేశారు. బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సులోచన మాట్లాడుతూ గత వారం చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 బాల,బాలికల సాఫ్ట్‌బాల్ జిల్లా క్రీడా ఎంపిక పోటీలలో పాఠశాల నుంచి 32 మంది విద్యార్థులు ఎంపికయినట్లు తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్న 32 మంది విద్యార్థులకు శరవణరెడ్డి క్రీడా దుస్తులను అందజేశారని అన్నారు. శరవణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలలో మంచి ప్రతిభను కనపరిచి పతకాలను సాధించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాష్, సదాశివం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి అదనపు గదులు


భూమిపూజ చేస్తున్న తహసీల్దార్, పరిశ్రమ ప్రతినిధులు

- నిర్మాణానికి సీసీఎల్ పరిశ్రమ చేయూత
- రూ.22 లక్షలతో 3 గదులు నిర్మాణం
- భూమిపూజ చేసి పనులు ప్రారంభం

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయంలో అదనపు గదుల నిర్మాణానికి మండలంలోని సీసీఎల్ కాఫీ పరిశ్రమ ముందుకొచ్చింది. రూ. 22లక్షలతో 3 గదుల నిర్మాణంకు సంబంధించి బుధవారం సీసీఎల్ పరిశ్రమ ప్రతినిధులు పీఆర్వో కిషోర్, డీజీఎం సురేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ గౌరిశంకరరావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయం భవనంలో పూర్తిస్థాయిలో గదులు లేక రికార్డుల ఏర్పాటుకు, వీఆర్వోల విధులు నిర్వహణ ఇబ్బందికరంగా మారుతున్న పరిస్థితులను సీసీఎల్ కాఫీ పరిశ్రమ యాజమాన్యానికి విన్నవించామన్నారు. దీనిపై స్పందించిన యాజమాన్యం పరిశ్రమ సీఎస్ఆర్ (కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద రూ. 22లక్షలు మంజూరు చేశారన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమానికి సహకారం అందించిన సీసీఎల్ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులను స్థానిక ప్రజాప్రతినిధులు సత్కరించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, వైస్ ఎంపీపీ పద్మావతి, రైతు సలహా కమిటీ అధ్యక్షుడు మురళీ నాయుడు, సర్పంచ్ వీరభద్రం, సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ శివా యాదవ్, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్త అరెస్టు


సత్యవేడు సర్కిల్ కార్యాలయంలో నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

సత్యవేడు: వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం దళితవాడలో నివాసం ఉంటున్న పావని(30)ని కత్తితో దాడి చేసి చంపిన కేసులో ఆమె భర్త ఇరకం కాటయ్య(36)ను అరెస్టు చేసినట్లు సీఐ ఎస్.శివకుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మృతురాలు పావని తల్లి కుదిరి మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వరదయ్యపాళెం పోలీసులు కేసు విచారణ చేపట్టారు. వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం దళితవాడకు చెందిన రాజవేలు కుమారుడు కాటయ్య 8 ఏళ్ల క్రితం నాయుడుపేట సమీపంలోని పూనేపల్లికి చెందిన పావనిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఇద్దరు వేర్వేరు కంపెనీల్లో పని చేసేవారు. వీరికి ఐదేళ్లలోపు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొద్ది నెలలుగా కాటయ్య కంపెనీలో జాబ్ మానేశాడు. భార్యను కూడా పనికి వెళ్లవద్దని చెప్పాడు. తాగుడుకు బానిసయ్యాడు. దీంతో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. డబ్బులు తేవాలని తరచూ భార్య పావనితో గొడవ పడేవాడు. పలుమార్లు పుట్టింటి నుంచి డబ్బులు తెచ్చింది. ప్రస్తుతం పావని 8 నెలలు గర్భిణి కావడంపైనా అనుమానపడేవాడు. వారం కిందట కూడా కాటయ్యకు డబ్బులు అవసరం కావడంతో పావనిని డబ్బులు తేవాలని గొడవ చేశాడు. ఈ నేపథ్యంలో భార్యను చంపేద్దామని నిర్ణయించుకుని రెండు పాత కత్తులు తెచ్చి ఇంట్లో పెట్టాడు. రెండు రోజుల క్రితం భార్యతో గొడవ పెట్టుకోవడంతో పుట్టింటికి వెళ్తానని పావని తెల్పి చెప్పడంతో కత్తితో గొంతు, తలపై నరికాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో పావని ఇంట్లోనే చనిపోయింది. అనంతరం కాటయ్య కత్తిని ఊరి సమీపంలోని చెరువు వద్ద ముళ్లపొదల్లో పడేసి సూళ్లూరుపేటకు వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం 8గంటలకు రాచకండ్రిగ బస్టాప్ వద్ద ఉన్న నిందితుడు కాటయ్యను పోలీసులు అరెస్టు చేశారు. పుత్తూరు డీఎస్పీ వై.శ్రీనివాసరావు ఈ సందర్భంగా హత్య కేసు ఛేదించిన సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి, ఎస్ఐ నాగార్జున రెడ్డి, ఏఎస్ఐ షణ్ముగం, కానిస్టేబుళ్లు హరి, గణేష్, కిరణ్‌ను అభినందించారు.

వంద రోజులు ఉపాధి కల్పించాలి


పనులను పరిశీలిస్తున్న ఏపీడీ సరిత

ఏర్పేడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో ప్రతి జాబ్ కార్డుదారుడికి వంద రోజులు పని కల్పించాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. బుధవారం మండలంలోని ఎండీవుత్తూరు పంచాయతీ పరిధిలో ఉపాధి పనులను ఆమె తనిఖీ చేశారు. కూలీల మస్టర్లు, సమస్యలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ పనుల్లో కూలీలకు గిట్టుబాటు కూలీ వచ్చే విధంగా కొలతలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. రోజుకు రూ.272 వేతనం వచ్చేలా చూడాలని చెప్పారు. పనులకు విరివిగా చేపట్టాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన రైతులను గుర్తించి వారి పొలాల్లో పండ్లు, పూలు, మునగ తోటల పెంపకం చేపట్టాలన్నారు. సాంకేతిక సహాయకుడు రవీంద్రుడు, క్షేత్ర సహాయకురాలు శ్యామల పాల్గొన్నారు.

కిక్కిరిసిన కాణిపాకం


భక్తులతో నిండిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతం ఉండడంతో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారి దర్శనార్థం భక్తులు తరలి రావడంతో స్వామివారి కంపార్ట్‌మెంట్లు, రూ.150, రూ.100 క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకొని భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.

నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని చిత్తూరుకు చెందిన రవికుమార్ ఆలయ అధికారులకు అందించారు. మిత్రులతో కలసి స్వామివారి దర్శనార్థం బుధవారం విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట


ఆలయంలో హోమ పూజలు


నూతనంగా నిర్మించిన శివాలయం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఉగ్గుమూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో బుధవారం శ్రీఅన్నపూర్ణ సమేత అమరేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్టాపన, కుంభాభిషేకం వైభవంగా ఘనంగా జరిగింది. హోమ పూజలు చేసి, ఆలయ గోపురంపై కలశాలకు పవిత్ర తీర్థాలతో అభిషేకం చేశారు. శ్రీఅమరేశ్వరస్వామి విగ్రహం ముందు నందీశ్వరుడిని ప్రతిష్టించారు. అనంతరం శ్రీఅన్నపూర్ణ సమేత అమరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌తో సాగునీరు


లిఫ్ట్ ఇరిగేషన్‌తో నీరు విడుదల

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : తొట్టంబేడు మండలం పొయ్య, కురవకనేరి గ్రామాలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగు నీటి సౌకర్యం కల్పించారు. గతంలో వరి పంటకు సాగు నీరు అందించలేక రైతులు అవస్థలు పడ్డారు. రైతులు ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు దృష్టికి తీసుకునివెళ్లారు. ఆయన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మండల ఎంపీపీ గ్రాంట్ నుంచి రూ.నాలుగు లక్షలు మంజూరు చేయించి, వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు తెలిపారు. ఇటీవల పనులు పూర్తి కావడంతో గ్రామానికి చెందిన రైతులు గున్నయ్య, గురవయ్య పేరుతో సర్వీసులు తీసుకుని చెంబేడు కాలువ నుంచి కురవకనేరి ట్యాంకుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 60 ఎకరాల పంట పొలాలకు సాగు నీరు అందిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు, ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మకు, ఉన్నం వాసుదేవనాయుడుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి

బుచ్చినాయుడుకండ్రిగ: దేశంలో మొట్టమొదటి భాషా సంయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యేందుకు పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం మరువలేనిదని పల్లమాల సర్పంచ్ రమణమ్మ అన్నారు. బుధవారం గ్రామ సచివాలయంలో సర్పంచ్ రమణమ్మ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని, పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సిబ్బంది, గ్రామస్తులు పుష్పాంజలి ఘటించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నలగోపాల్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి మునికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గాల్లో తేలిపోదాం..

– తిరుపతిలో జాయ్ రైడ్‌తో ఆకాశయానం

తిరుపతి రూరల్: ఆకాశయానం ద్వారా తిరుపతి, చంద్రగిరి అందాలను వీక్షించేందుకు అద్భుత అవకాశం వచ్చింది. ప్రజలకు, శ్రీవారి భక్తులకు హెలీ టూరిజం సేవలను ఎరోడాన్ సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చింది. తుమ్మలగుంటలోని కేవీఎస్ క్రీడా మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ నుంచి హెలీకాప్టర్ జాయ్ రైడ్‌ను బుధవారం ప్రారంభించారు. నవంబర్ 7వ తేదీ వరకు ఈ హెలీకాప్టర్ అందుబాటులో ఉంటుంది. ఒక వ్యక్తికి రూ.6వేల చార్జీని వసూలు చేస్తారు. తుమ్మలగుంట హెలీప్యాడ్ నుంచి తిరుపతి మీదుగా చంద్రగిరి కోటతో పాటు చుట్టుపక్కల 10 నిమిషాల పాటు ఈ రైడ్ కొనసాగుతుందని ఎరోడాన్ సంస్థ ప్రతినిధి సుకుమార్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ హెలీకాప్టర్ జాయ్ రైడ్ అందుబాటులో ఉంటుందన్నారు. బుకింగ్ కోసం 9003077710 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. హెలీకాప్టర్ జాయ్ రైడ్ ప్రారంభం సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తుమ్మలగుంట హెలీప్యాడ్ వద్దకు పెద్ద సంఖ్యలో స్థానికులు విచ్చేశారు. హెలీకాప్టర్‌ను దగ్గరగా చూడడమే కాకుండా, జాయ్ రైడ్ విశేషాలను అడిగి తెలుసుకునేందుకు ఆసక్తి చూపారు.


తుమ్మలగుంటలోని హెలీప్యాడ్ నుంచి ప్రారంభమైన హెలీకాప్టర్ జాయ్‌రైడ్, వీక్షిస్తున్న నగరవాసులు